సర్పంచుల సేవలు అభినందనీయం

భీంపూర్ : మహిళా సర్పంచ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- సర్పంచ్‌లకు సన్మానాలు

భీంపూర్, జనవరి 31 : ఐదేండ్ల కాలంలో సర్పంచులు బంగారు తెలంగాణ సాకారం దిశగా, పల్లె ప్రగతికి విశేష సేవలందించారని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ కొనియాడారు. ఫిబ్రవరి 1 గురువారంతో సర్పంచుల పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో పిప్పల్‌కోటిలో సర్పంచ్ కేమ కళ్యాణిని ఉపాధ్యాయులు, అంగన్‌వాడి కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పంచాయతీ సమస్యలు ప్రస్తావించి పరిష్కారం చేయడంలో కళ్యాణి ముందుండేవారన్నారు. సర్పంచులుగా మహిళలు రాణిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు ఏ స్థాయి వారైనా మాజీలు అయినా ప్రజాసేవలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌లో..

ఉట్నూర్, జనవరి 31 : గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌లు కీలకంగా వ్యవహరించారని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు అన్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ఎంపీడీవో సమావేశ మందిరంలో వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఆటంకాలు కలుగకుడా, ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంతో పాటు ప్రజలకు ఎల్లవేళలా సేవలందిస్తూ గ్రామాభివృద్ధిలో కీలకంగా మారారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తిరుమల, వైస్ ఎంపీపీ బాలాజీ, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మావల మండలంలో..

ఆదిలాబాద్ రూరల్, జనవరి 31 : పదవీ కాలం ముగుస్తున్న మావల మండలంలోని బట్టిసావర్గం, మావల, వాఘాపూర్ సర్పంచ్‌లు రాగం గంగమ్మ, ప్రమీల, మయూరిని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సంగీత ఆధ్వర్యంలో సన్మానించారు. పదవీకాలంలో వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వనితారాజేశ్వర్, ఎంపీడీవో సునీత, ఎంపీవో లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.



సర్పంచ్‌లతో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు

తుడుందెబ్బ మండల కమిటీ

ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

బోథ్, జనవరి 31 : ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ సోనాల నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జుగ్నాక్ మారుతి, కార్యనిర్వహణ అధ్యక్షుడిగా పెస్వే సగ్రామ్, ఉపాధ్యక్షులుగా మెస్రం లాలురాం, దన్వే ప్రకాశ్, కుమ్ర మాణిక్‌రావ్, సిడాం మాణిక్‌రావ్, ప్రధాన కార్యదర్శిగా రాయిసిడాం జకేశ్, కోశాధికారిగా సిడాం దత్తు, కార్యదర్శులుగా తొడసం భీంరావ్, మెస్రం సీతారాం, ప్రచర కార్యదర్శులుగా సిడాం హెమన్‌రావ్, గెడం బండు, మెస్రం మారుతి, గయక్వాడ్ శ్రీరాం, సాంస్కృతిక కార్యదర్శిగా ఉయిక లక్ష్మణ్, సలహాదారులుగా నైతం దేవురావ్, రాయిసిడాం ఇస్రు, తొడసం లక్ష్మణ్, సోయం బాపురావ్, ఆత్రం గంగారం, ఆత్రం గోవింద్ రావ్, కుడ్మెత దేవ్‌రావ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్, ఐటీడీఏ డైరెక్టర్ మెస్రం భూమన్న, రాయిసెంటర్ సర్మెడి తొడసం లక్ష్మణ్ పాల్గొన్నారు.

జడ్పీటీసీకి జిల్లా బీజేపీ పగ్గాలు

బీజేపీ అధ్యక్షుడు బ్రహ్మానంద్‌ను సన్మానిస్తున్న నాయకులు

గుడిహత్నూర్, జనవరి 31 : గుడిహత్నూర్ జడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్‌కు బీజేపీ జిల్లా పగ్గాలు అప్పజెప్పారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఉత్తర్వులు జారి చేశారు. కాగా, బుధవారం మండల నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆయనకు ఘన స్వాగతం పలికి, శాలువాతో సన్మానించారు. ఇప్పటివరకు పాయల్ శంకర్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నాడు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. ఆయన స్థానంలో జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్‌కు పదవిని కట్టబెట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నాగర్‌గోజే భరత్, డాక్టర్ కేంద్రె లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'స్టాఫ్ నర్స్'కు గిరి యువతులు ఎంపిక

కనక శ్రీదేవి

మడావి సరస్వతి

బోథ్, జనవరి 31 : మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన కొత్తపల్లి గ్రామానికి చెందిన మడావి సరస్వతి లక్ష్మణ్, కనక శ్రీదేవి చిత్రు స్టాఫ్ నర్స్ జాబ్‌కు ఎంపికయ్యారు. కాగా, బుధవారం ఉదయం ఆర్డర్ కాపీ తీసుకునేందుకు హైదరాబాద్ వెళ్లారు. ఒకే గ్రామం నుంచి ఆదివాసీ గిరిజన గోండు బిడ్డలకు జాబ్ రావడం సంతోషంగా ఉందని ఐటీడీఏ మాజీ డైరెక్టర్ అభినందించారు.

గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్ రూరల్, జనవరి 31 : మారుమూల గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండలంలోని మత్తడిగూడ, నాగాపూర్‌లలో కొత్తగా నిర్మించిన జీపీ భవనాలను బుధవారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పంచాయతీలకు అందిస్తున్న నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు నిర్వహించాలన్నారు. మౌలిక సదుపాయాలకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్తడిగూడ సర్పంచ్ మడావి యశోదమోతీరాం, నాగాపూర్ సర్పంచ్ జాదవ్ సునీల్, ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, జడ్పీటీసీ చారులత రాథోడ్, వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, డీఎల్‌పీవో భిక్షపతి గౌడ్, ఎంపీవో మహేష్, ఉప సర్పంచ్ సాగర్, శ్యాంపూర్ మాజీ సర్పంచ్ జగదీష్ జాదవ్, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

ఉట్నూర్, జనవరి 31 : ఏజెన్సీలో రైల్వే, సాగు, తాగు నీటికి శాశ్వత పరిష్కారం చూపాలని సాధన కమిటీ సభ్యులు రామారావ్, కట్ట లక్ష్మణచారి, కేశవ్ కోరారు. ఈ మేరకు స్థానిక కుమ్రం భీం ప్రాంగణంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను కలిసి, వినతిపత్రం సమర్పించారు. ఏజెన్సీలో ఇప్పటికీ విద్య, వైద్యం, రోడ్డు, రైల్వే రవాణాకు ఉద్యమించాల్సి వస్తున్నదన్నారు. ఇప్పటికైనా ఏజెన్సీ ప్రాంతంలో ఈ సదుపాయాలు కల్పించాలని కోరారు. లేకపోతే ఉద్యమాలు చేస్తూనే ఉంటామని తెలిపారు.

ఆర్ఎంపీలకు శిక్షణ ఇప్పించాలి..

ఆర్ఎంపీలకు తిరిగి పారామెడికల్ శిక్షణ ఇప్పించాలని కోరుతూ ఆ సంఘం వెల్ఫేర్ సొసైటీ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు భీమడు ఎమ్మెల్యేను కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింలు, ఉట్నూర్ అధ్యక్షుడు చెంచాల రమణ, వెంకటేశ్, ఉమేశ్, శంకర్, రాజన్న, సుదర్శన్, సుధాకర్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

షీ టీం సేవలపై అవగాహన

తాంసి(తలమడుగు), జనవరి 31 : సాయిలింగి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు షీ టీం సేవలపై సభ్యురాలు సుశీల అన్నారు. ఆకతాయిలు వేదిస్తే వెంటనే షీ టీమ్‌ను సంప్రదించాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. సైబర్ క్రైం, చట్టాలు, హెల్ప్ లైన్ నంబర్లు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు–వాటితో ఏర్పడే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. షీ టీం సభ్యులు సత్యం, మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

భీంపూర్, జనవరి 31 : విద్యార్థులు మహనీయుల జీవిత చరిత్రలను చదవాలని, వారిని స్ఫూర్తిగా తీసుకుని ఎదగాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు. భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కల్యాణి, ఉప సర్పంచ్ సుభాష్, హెచ్ఎం రమేశ్, ఉపాధ్యాయులు శంకర్, వీరాకుమార్, నాయకులు గంగయ్య, రాంరెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఖాందేవ్ జాతర

నార్నూర్, జనవరి 31 : మండల కేంద్రంలోని ఖాందేవ్ జాతర ఐదు రోజుల నుంచి కొనసాగుతున్నది. బుధవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో సందడిగా కనిపించింది. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో దుకాణాల వద్ద వస్తువులు కొనుగోలు చేస్తూ కనిపించారు. రంగుల రాట్నాల వద్ద యువతీయువకులు సందడి చేశారు. ఫిబ్రవరి 8వ తేదీ వరకు జాతర కొనసాగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

ఖాందేవ్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బోథ్ ఎమ్మెల్యేకు అల్లోల పరామర్శ

ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నేరడిగొండ, జనవరి 31 : నేరడిగొండ మండలం రాజురా గ్రామంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను, వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ బుధవారం పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో అనిల్ జాదవ్ చిన్న నాన్న కొడుకు జాదవ్ అంబారావ్ మృతిచెందారు. కాగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు తెలిపారు. వారితోపాటు ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు అక్షయ్, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

దేశ నిర్మాతలు విద్యార్థులే

- కేయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ నారాయణ

మంచిర్యాలటౌన్, జనవరి 31: దేశ భవిష్యత్ నిర్మాతలు విద్యార్థులేనని కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఈసం నారాయణ అన్నారు. మంచిర్యాలలోని వివేకావర్ధిని డిగ్రీ, పీజీ కాలేజీలో ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల ప్రోగ్రాం అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ నారాయణ మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే తోటివారికి సహాయ పడేలా జాతీయ సేవా పథకం శిక్షణనిస్తుందని తెలిపారు. ఒకరికొకరు సహకరించుకోవడం మానవతా లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు గ్రామాల్లో పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సూత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సంపూర్ణ అక్షరాస్యత, వయోజనవిద్య, జనాభా నియంత్రణ, అంటువ్యాధులు, మూఢనమ్మకాలపై ప్రజలను చైతన్యపరచాలని తెలిపారు. ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ చంద్రమోహన్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఆసిఫాబాద్ జిల్లా కన్వీనర్ తిరుపతి, నిర్మల్ జిల్లా కన్వీనర్ మురళి, ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సత్యనారాయణ, ప్రోగ్రాం అధికారులు చంద్రశేఖర్, మోహన్, సుధాకర్, కిషోర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో పాలకవర్గ సభ్యుల పాత్ర కీలకం

మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్, జనవరి 31 : పంచాయతీల అభివృద్ధిలో పాలకవర్గ సభ్యుల పాత్ర చాలా కీలకమని ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో బుధవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆత్మీయ సన్మాన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాలకవర్గం సభ్యులు, సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్‌లను శాలువతో సన్మానించారు. సహకార సంఘం చైర్మన్ ఆడే సురేశ్, ఎంపీటీసీ కే.పరమేశ్వర్, మాజీ జడ్పీటీసీ హేమలత, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్ పాల్గొన్నారు

కుష్టు నిర్మూలనకు ప్రతిజ్ఞ

ఇచ్చోడ, జనవరి 31 : మండలంలోని కొకస్మన్నూర్ గ్రామంలో బుధవారం వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీలు కుష్టు నివారణ కోసం ప్రతిజ్ఞ చేశారు. శరీరంపై స్పర్శలేని గోధుమ రంగు మచ్చలుంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ ఉత్తంసింగ్, హెచ్ఏ రాథోడ్ కైలాశ్, తులసి, ఏఎన్ఎం, సర్పంచ్ భతుల గంగారం పాల్గొన్నారు.

నార్నూర్, జనవరి 31 : కుష్టు నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని హెచ్ఈవో పవార్ రవీందర్ అన్నారు. గాదిగూడ మండలం ఖండోలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రహరి, హెల్త్ అసిస్టెంట్ సురేశ్, ఏఎన్ఎం కవిత, సీహెచ్‌డబ్ల్యూ నాగుబాయి ఉన్నారు.

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

ఇచ్చోడ, జనవరి 31 : ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఏ వెంకట్ అన్నారు. సిరికొండ మండలంలోని జడ్పీఎస్ఎస్, ఉర్దూ పాఠశాల, కేజీబీవీ పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. టీఎస్ యూటీఎఫ్ 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి నిధులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాల్సిన ప్రభుత్వం మెనూ ప్రకారం రేట్లు పెంచకుండా జాప్యం చేయడంతోపాటు సకాలంలో బిల్లులు చెల్లించలేక అనేక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజనాన్ని ఒక ప్రత్యేక కార్యక్రమంగా తీసుకోవాలన్నారు. ఏడాదికి సరిపడా బడ్జెట్‌ను ఒకేసారి కేటాయించాలని, తద్వారా నెల నెలా బిల్లులు చెల్లించేట్లుగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాంప్లెక్స్ హెచ్ఎం సునీల్, సిరికొండ మండలాధ్యక్షుడు సూర్యప్రకాశ్, మండల ప్రధాన కార్యదర్శి విఠల్, కన్వీనర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వెంకట్

కళాశాలలో క్రీడా సాంస్కృతిక వార్షికోత్సవం

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బోథ్, జనవరి 31 : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం క్రీడా సాంస్కృతిక వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు పాటలపై నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బీ శంకర్, ప్రిన్సిపాల్ సంఘం అధ్యక్షుడు గణేశ్, తాంసి కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, బజార్‌హత్నూర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీల్, నేరడిగొండ కళాశాల ప్రిన్సిపాల్ షబానా తరణం, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, బోథ్ ఎంపీటీసీ రజియా బేగం, జడ్పీటీసీ సంధ్యారాణి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపక సంఘం రాష్ట్ర కార్యదర్శి బలరాం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

ఆదిలాబాద్ రూరల్, జనవరి 31 : ఆదిలాబాద్‌లోని రోడ్లపై ప్రమాదకరంగా ఉన్న ఆక్రమణలను తొలగించాలని భజరంగ్ దళ్ నాయకులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కమిషనర్ శైలజకు వినతి పత్రం అందజేశారు. అగ్నిమాపక శాఖ కార్యాలయానికి ఆనుకొని ఉన్న పలు పండ్ల దుకాణాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని వెంటనే తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండారి సంతోష్, హిందూ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రిలే దీక్షలకు మద్దతు

ఎదులాపురం, జనవరి 31 : ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ సాధన కమిటీ ఆర్అండ్‌బీ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు బుధవారానికి 16వ రోజుకు చేరుకున్నాయి. కాగా, ఆదిలాబాద్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యూనిస్ అక్బానీ దీక్షలకు మద్దతు తెలిపారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో రైల్వేలైన్‌కు నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి చైర్మన్ నారాయణ, నాయకులు నరేందర్, రఫీక్, చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఉన్నారు.

అధికారికి సన్మానం

జైనథ్, జనవరి 31 : జైనథ్ ఎంపీవో వెంకట్‌రాజు ఆదిలాబాద్ మండలానికి డిప్యూటేషన్‌పై వెళ్తుండగా, ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ మార్సెట్టి గోవర్ధన్ సన్మానించారు. నాలుగేండ్లుగా మండలంలోని పంచాయతీలను అభివృద్ధి పర్చారన్నారు. ఎంపీడీ వో గజానన్‌రావ్, సూపరింటెండెంట్ ము త్యంరాజు, నాయకులు గణేశ్ యాదవ్, వినో ద్ యాదవ్, ప్రశాంత్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన

జైనథ్, జనవరి 31 : జైనథ్ మండలం మేడిగూడ, బేల మండలం సైద్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు జామిని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. లింగ వివక్షత, ఫోక్స్ చట్టాలపై జెండర్ కో–ఆర్డినేటర్ కృష్ణవేణి, కోటేశ్వర్లు వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తాం

ఎదులాపురం, జనవరి 31 : గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న నవజాత శిశువు నుంచి 18 ఏండ్లలోపు అవసరమైన వారికి ఉచితంగా హైదరాబాద్‌లోని అపోలో దవాఖానలో శస్త్రచికిత్స నిర్వహిస్తామని పిడియాట్రిక్, కార్డియాలజిస్ట్ డాక్టర్ అమోల్ అన్నారు. రిమ్స్ దవాఖానలోని డైస్ సెంటర్‌లో బుధవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ అమోల్ మాట్లాడుతూ.. చిన్నపిల్లల్లో గుండె సంబంధిత వ్యాధుల తీవ్రతను బట్టి చికిత్స చేస్తామన్నారు. అందులో అవసరం ఉన్నవారికి మాత్రమే యాన్జియోగ్రాం, ఓపెన్ హార్ట్‌సర్జరీలు ఉచితంగా చేస్తామని తెలిపారు. ఇప్పటికే మూడు శిబిరాలు నిర్వహించామని పేర్కొన్నారు. ఈ క్యాంపులో డైస్ సిబ్బంది ఉన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అమోల్

జాతరను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

సీఐ రహీమ్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

నార్నూర్, జనవరి 31 : ఖాందేవ్ జాతరను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని నార్నూర్ సీఐ రహీమ్‌పాషా అన్నారు. మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఖాందేవ్ ఆలయ కమిటీ సభ్యులు, ఆదివాసీ నాయకులు సీఐ రహీమ్‌పాషాను మర్యాదపూర్వకంగా కలిసి, శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పోలీసులకు తమ సమస్యలు నిర్భయంగా తెలియజేయాలన్నారు. గిరిజనులు అమాయకులని, చిన్న చిన్న గొడవలతో పోలీస్‌స్టేషన్‌కు వస్తే కేసులు నమోదు చేయకుండా కౌన్సెలింగ్ చేయాలని ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్ సీఐని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూసం ఇస్రూ, బాపురావ్, ఆనంద్‌రావ్, సోము తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య వార్షిక క్రీడోత్సవాల్లో విజయం

ఆదిలాబాద్ రూరల్, జనవరి 31 : నిజామాబాద్ జోన్ శ్రీ చైతన్య విద్యాసంస్థల వార్షిక క్రీడోత్సవాల్లో ఆదిలాబాద్ జిల్లా మావల విద్యార్థులు విజయం సాధించారు. నిజామాబాద్‌లోని రాజారామ్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఈ ఉత్సవాలను ఆ విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ ముఖ్యఅతిథిగా హాజరై, ప్రారంభించారు. ఖోఖో, కబడ్డీ, క్యారమ్స్, చదరంగం, పరుగుపందెం బాలుర, బాలికల విభాగంలో అన్నింటిలో మావల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ముఖ్యంగా నిజామాబాద్ జోన్ ఛాంపియన్ అవార్డ్‌ను కైవసం చేసుకున్నట్లు చెప్పారు. నిజామాబాద్ జోనల్ ఏజీఎం జితేందర్, తెలంగాణ రిటైర్డ్ డీఎస్పీ బాలకిషన్‌రావ్, నిజామాబాద్ జోనల్ కో–ఆర్డినేటర్ నరేందర్, వ్యాయామ ఉపాధ్యాయులు సాయి, వినోద్, లక్ష్మి పాల్గొన్నారు.

పతకాలను చూపిస్తున్న ఆదిలాబాద్ విద్యార్థులు

గురుకులాల్లో కార్పొరేట్ స్థాయి విద్య

ఎదులాపురం, జనవరి 31 : తెలంగాణ మైనార్టీ గురుకులాల్లో నాణ్యమైన విద్యతో పాటు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆర్ఎల్‌సీవో రహీల్ అహ్మద్ అన్నారు. మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాల కోసం బుధవారం పట్టణంలో విద్యార్థులు ప్రధాన వీధుల గుండా బ్యాండ్‌మేళాలతో ర్యాలీ తీశారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతున్నదన్నారు. ఈ నెల 24 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు అడ్మిషన్లు జరుగుతాయన్నారు. ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థులకు బహుమతులు

బోథ్, జనవరి 31 : బోథ్ మండలం సోనాల పాఠశాలలో బుధవారం జనవరిలో 20 పాఠశాల పని దినాలకు గాను పూర్తి రోజులు హాజరైన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు ఆర్ మధుసూదన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు పీ లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయులు జీ గీతవాణి, ఏ శ్రావణి, ఎస్ నాగుబాయ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం

భీంపూర్, జనవరి 31 : భీంపూర్‌లో నూతన అంగన్‌వాడీ భవనాన్ని బుధవారం సర్పంచ్ మడావి లింబాజీ ప్రారంభించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రూ.5 లక్షలతో భవనం మంజూరైంది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జాదవ్ రవీందర్, ఎంపీటీసీ అన్నపూర్ణ, కార్యదర్శి సాయినందన, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రియ, సుజాత, నాయకులు ఉత్తంరాథోడ్, సిడాం పురుషోత్తం తదితరులున్నారు.

3న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 31 : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 3న ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లాస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, పీ రాజేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–8, 10, 12, 14 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించే ఈ పోటీలకు క్రీడాకారులు ధ్రువీకరణ పత్రాలతో రిపోర్ట్ చేయాలని సూచించారు.

ప్రభాకర్‌కు సన్మానం

ఉట్నూర్ రూరల్, జనవరి 31 : మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన దంతన్‌పెల్లికి చెందిన దాసండ్ల ప్రభాకర్‌ను బుధవారం బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ సన్మానించారు. గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి పదవి చేపటడం గర్వకారణమని అన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319428-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677